క్లుప్తంగా

మండల సర్వసభ్య సమావేశం రేపు

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురం మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో 4వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మంచికంటి రంగసుబ్బరాయుడు తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు హాజరు కావాలన్నారు. అదేవిధంగా అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

పీసీ పల్లి: మండల స్థాయి పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో ఎంఈఓలు ఆర్. శ్రీనివాసాచారి, సంజీవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన్లు విధుల గురించి వివరించారు. పాఠశాల అభివృద్ధికి యాజమాన్య కమిటీ సహకరించాలన్నారు. అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ


సచివాలయం తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ

పీసీపల్లి: మండల పరిధిలోని పెద్ద అలవలపాడు సచివాలయాన్ని ఎంపీడీవో ప్రభాకర్ శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ సచివాలయాల వద్ద, ఎస్సీ కాలనీల్లో, కుల సర్వేకు సంబంధించి జాబితాలను విడుదల చేశారని చెప్పారు. దానికి సంబంధించి ఎవరికైనా అనుమానాలుంటే సంబంధించిన సచివాలయాల్లో ఈ నెల ఏడో తేదీ లోపు తెలియజేయాలన్నారు. అలా వచ్చినవి పరిశీలించి ఈనెల 17వ తేదీ లోపు ఫైనల్ లిస్టు ప్రకటిస్తామని చెప్పారు. అనంతరం ఎంఎస్ఎంయూ మిస్సింగ్ సిటిజెన్, పేస్ ఇ- కేవైసీ సర్వేల్లో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యల పరిష్కారం


అనుమునిగిరిలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమణారావు

పామూరు: భూసమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. మండలంలోని అనుమునిగిరిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి ఆన్‌లైన్‌కోసం, సర్వే కోసం, సవరణల కోసం మొత్తం 5 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ బి.మల్లికార్జునరావు, ఈఓఆర్డీ కేఎల్ శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ కందుల శ్రీనివాసరెడ్డి, వీఆర్ఓ వెంకటస్వామి, పీఎస్ నాగేశ్వరరావు, పోతురాజు వెంకట్రావు, దైండే శివశంకర్, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నేడు కోఆర్డినేషన్ సమావేశం

కొండపి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తనిఖీ బృందంతో కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి నిర్వహించిన పనులను తనిఖీ చేయడానికి తనిఖీ బృందం మండలానికి వచ్చినదని తెలిపారు. మండలంలోని ప్రజలు, సంబంధిత ఉద్యోగులు తనిఖీ బృందానికి సహకరించాలని కోరారు.

కొండపి మండలంలో ఇష్టానురీతిగా తరలింపు

యథేచ్ఛగా ఇసుక మేత


రాత్రి వేళలో కొండపి మీదుగా వెళుతున్న ఇసుక ట్రాక్టర్


పాలేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీ

- ట్రాక్టర్లు, లారీల నుంచి రాత్రి వేళలో ఇతర ప్రాంతాలకు రవాణా
- టీడీపీ నేతల చేతుల్లోకి లక్షలాది రూపాయల ప్రజాధనం

కొండపి:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి రాజ్యమేలుతోంది. ఎక్కడంటే అక్కడ భూ కబ్జాలకు పాల్పడటం.. ప్రతిపక్ష నేతలపై దాడులు చేయడం నిత్యకృత్యంగా మారాయి. ప్రజా సమస్యలపై మాట్లాడటమే పాపం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు ప్రకృతి సమతుల్యాన్ని దెబ్బతీసే విధంగా నదుల నుంచి ఇసుకను ఇష్టానురీతిగా తవ్వేస్తున్నారు. దీని వలన భూగర్భ జలాలు ఇంకిపోతున్నా ఏమాత్రం ఖాతరు చేయడంలేదు.మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. జరుగుమల్లి మండలం పాలేరు వాగు నుంచి రాత్రి వేళలో లారీలు, ట్రాక్టర్లుకు జేసీబీతో ఇసుక నింపి మండలంలోని పలు ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఈ ఇసుక అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ఇసుక వ్యాపారస్తులు తమ జేబులను నింపుకుంటున్నారు. ఉచితంగా అందాల్సిన ఇసుకను టన్ను 800 నుంచి 1000 రూపాయల వరకు వసూలు చేస్తూ అమ్ముకుంటున్నారు. దాదాపు ప్రతి రోజూ 50 నుంచి 70 ట్రిప్పులు ఇసుకను కొండపి మీదగా తరలిస్తున్నారు. ఇలా ఇసుకాసురులు రోజుకు వేలాది రూపాయలు సంపాదిస్తూ జేబులో నింపుకుంటున్నారు. ఒక పక్క కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇసుకను ఉచితంగా అందిస్తున్నామని ప్రకటిస్తున్నా.. అవి మాటలకే పరిమితం అవుతున్నాయి. అదును చూసుకొని ఇసుక వ్యాపారం చేసుకునే వారు భారీగా డబ్బులు సంపాదించుకుంటున్నారు. లారీలు అధిక లోడుతో ప్రయాణించడం వలన రోడ్లు దెబ్బతింటున్నాయని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. నేతివారిపాలెం, కట్టావారిపాలెం మధ్య భారీ గుంతలు ఏర్పాడ్డాయి. ఇసుకను నింపిన లారీలు, ట్రాక్టర్లు రాత్రి వేళలో అధిక వేగంతో ప్రయాణిస్తున్నాయని, ఆ సమయంలో ప్రమాదాలకు ఎక్కువ జరిగే అవకాశాలున్నాయని ప్రజలు అంటున్నారు. రాత్రి వేళలో బహిరంగంగానే ఇసుక అక్రమణా రవాణా జరుగుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు అక్రమ రవాణా అరికట్టి, అక్రమ రవాణా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జేబులు నింపుకుంటున్నారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని రోజులు ఇసుకను అందించారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వంలోని పార్టీదారులు ఇసుకను యథేచ్ఛగా అమ్ముకుంటున్నారు. ఇసుకను టన్ను ఎనిమిది వందల నుంచి వెయ్యి రూపాయల వరకు అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్నారు.

–వై. వసంత్, కొండపి

మాట నిలబెట్టుకోవాలి



కూటమి ప్రభుత్వంలోని నాయకులు ఇసుకను అమ్ముకుంటున్నారు. పాలేరు నుంచి ఇసుకను కొండపి మండలంలోకి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణా అడ్డుకోవాలి. పేద ప్రజలకు ఉచిత ఇసుకను ఇస్తానన్న కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి.

అల్లడి నారాయణ, కొండపి


బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

బూచేపల్లిని కలిసిన దద్దాల


సమావేశంలో దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఒంగోలులోని జెడ్పీ కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, స్వీట్లు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతి రెడ్డి, జెడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి, లక్ష్మీకాంతం రెడ్డి, వెంకట రాజు యాదవ్, పార్టీ మండల కన్వీనర్లు యక్కంటి శ్రీనివాసులరెడ్డి, ఒకే రెడ్డి, సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, కస్తాల బాలాజీ, కటికల వెంకట రత్నం తదితరులు పాల్గొన్నారు.

దయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయండి

కనిగిరిరూరల్: నియోజకవర్గంలోని పీసీపల్లిలో కిడ్నీ రోగుల కోసం దయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ విన్నవించారు. గురువారం ఒంగోలులో జరిగిన జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో దద్దాల నారాయణ యాదవ్ పలు సమస్యలపై మాట్లాడారు. జెడ్పీ హైస్కూల్స్‌లో అకారణంగా వాచ్‌మేన్‌లను మార్చవద్దని.. సీఈఓకు, జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు కస్తూరిరెడ్డి, ఒకే రెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, లక్ష్మీ కాంతం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో జేవీవీ పాత్ర కీలకం


జేవీవీ క్యాలెండర్ ఆవిష్కరణలో చైర్మన్ గఫార్, డాక్టర్ మురళి

కనిగిరి రూరల్: సమాజాన్ని జాగృతం చేయడంలో జేవీవీ పాత్ర కీలకమని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, డాక్టర్ పెరుగు మురళీ కృష్ణ అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో జేవీవీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. జేవీవీ జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్కే గయాజ్, ఎస్సై టి. శ్రీరామ్, హెచ్ఎం కలువ విజయలక్ష్మి, పరశు సత్యగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జేవీవీ క్యాలెండర్ ఆవిష్కరణ

జన విజ్ఞాన వేదిక కొత్త ఏడాది క్యాలెండర్‌ను డాక్టర్ కిరణ్ కుమార్ గురువారం స్థానిక ఆస్పత్రి ఆవరణలో ఆవిష్కరించారు. వి. మాలకొండారెడ్డి, ఖాజాహుస్సేన్, బషీరా, జి. శ్రీనివాసులరెడ్డి, కృష్ణమూర్తి, విశ్రాంతఎంఈఓబ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

కాలిబాటలతో తెగుళ్ల నివారణ


సీఎస్‌పురం: వరినాటు విధానం, పద్ధతులను వివరిస్తున్న అధికారులు


సీఎస్‌పురం: రైతులకు సాగులో సూచనలు ఇస్తున్న ఏఓ సంపత్‌కుమార్

సీఎస్‌పురం (పామూరు): వరిసాగులో ఉత్తరం, దక్షిణం కాలిబాటలు తీయడంద్వారా గాలి, వెలుతురు తగిలి పురుగులు, తెగుళ్ల ఉధృతి తగ్గి 10 నుంచి 15 శాతం అధిక దిగుబడులు వస్తాయని ఏఓ బి.సంపత్‌కుమార్ అన్నారు. గులచిలక, చెన్నపునాయునిపల్లె గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వరి నారుమళ్లు, వరి నాట్లు, జొన్న, మొక్కజొన్న పైర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ వరి నాటే సందర్భంలో కొసలు తుంచి నాటడంవల్ల కాండం తొలిచే పురుగును సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. రైతులు రసాయన ఎరువులతో పాటు జీవన ఎరువులు, సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. ఈసందర్భంగా వరి పైర్లను ఆశించే తెగుళ్లను వివరించి నివారణ పద్ధతులను రైతులకు సూచించారు. ఏఈఓ పావలి శ్రీనివాసులు, వి.చిరంజీవిరెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.


కనిగిరి: మాట్లాడుతున్న ఏఓ

అధికారుల సూచనలు పాటించండి

కనిగిరి రూరల్: రైతులు అధికారుల సలహాలను, సూచనలు పాటించి అధిక దిగుబడులను పొందాలని ఏఓ జోత్స్నా దేవి అన్నారు. మండలంలోని కాశీపురం, శంఖవరం రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఏఓ మాట్లాడుతూ రైతులు పంటల సస్య రక్షణ చర్యలను పాటించాలన్నారు. రబీలో సాగు చేసిన మినుము, శనగ, నువ్వులు, వరి, పొగాకు, మిరప, తదితర పంటలను తప్పని సరిగా రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది కె. స్వర్ణ, డి. హసీనా పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం


నిందితుడు, మద్యంతో ఎక్సైజ్ అధికారులు

కొండపి: మండలంలోని కె. ఉప్పలపాడు గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోనికి తీసుకొని ఏడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శివకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కె. ఉప్పలపాడు గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామని, ఆ దాడిలో భోగిరెడ్డి పేరిరెడ్డి అనే వ్యక్తి మద్యం అమ్ముతుండగా పట్టుకొని అతని వద్ద ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో బంగారు భవిష్యత్

పామూరు: బడిఈడు పిల్లలు పనులకు కాకుండా బడిబాట పట్టి విద్యాభ్యాసం చేసినప్పుడే వారి భవిష్యత్ బంగారు బాట అవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, స్వయం కృషి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ షేక్ నాయబ్‌రసూల్ అన్నారు. మండల కేంద్రమైన పామూరు వడ్డె పాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం హెచ్ఎం జమ్ముల శ్రీనివాసులు అధ్యక్షతన బంగారు బాల్యం-బంగారు ప్రకాశం కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయురాలు అరుణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త షేక్.రమీజా, అమల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వైజ్ఞానిక ప్రదర్శన


హెచ్ఎంపాడు హైస్కూలో సైన్సు ప్రాజెక్టులు పరిశీలిస్తున్న ఎంఈఓలు

హనుమంతునిపాడు: మండల కేంద్రం హనుమంతునిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో గురువారం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన గురువారం నిర్వహించారు. ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఒక కేజీబీవీకి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మండల విద్యాశాఖ అధికారులు విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టలను పరిశీలించారు. ఎంఈఓలు పెద్దిరాజు, రమణయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉండే ప్రతిభా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శలు ఉపయోగ పడతాయన్నారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందించారు. హెచ్ఎంలు బీవీ సుబ్బారావు, అంజమ్మ, శేషారెడ్డి, మోహన్‌రావు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పాఠశాలలను అభివృద్ధి చేయాలి

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం పేరెంట్స్ కమిటీలను ఏర్పాటు చేసిందని ఎంఈఓ బి. నాగేంద్రవదన్ అన్నారు. జరుగుమల్లి మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు.

సీఎస్‌పురం(పామూరు): పాఠశాలల అభివృద్ధిలో పాఠశాల యాజమాన్య కమిటీలది కీలపాత్ర అని డీఎల్‌డీఓ, మండల ప్రత్యేకాధికారి కె.శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం పాఠశాలల హెచ్ఎంలకు, యాజమాన్య కమిటీల చైర్మన్‌లకు ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డిల పర్యవేక్షణలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆర్‌పీలు పి.మాలకొండయ్య, రామకృష్ణ, చెన్నయ్య పాల్గొన్నారు.

సింగరాయకొండ: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఈఓ-2 ఆవుల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి పాఠశాల యాజమాన్య శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. హెచ్ఎంలు, పేరెంట్ కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత


విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు

పీసీ పల్లి: రాచగుండ్ల భవాని దేవి జ్ఞాపకార్థం, భర్త రాజగుండ్ల శ్రీనివాసులు మండల పరిధిలోని పిసిపల్లి కస్తూర్బా పాఠశాలలో 10వ తరగతి స్టడీ మెటీరియల్ గురువారం అందజేశారు. సుమారు 5 వేల విలువగల మెటీరియల్ అందజేయడం అభినందనీయమని ఎంఈఓ సంజీవి అన్నారు. పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని పంపిణీ చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ఎంఈఓ శ్రీనివాసులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. హెచ్ఎంలు అంజలీదేవి, సుభాని, సుబ్రహ్మణ్యం, ఎస్ఓ సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

దాతల సహకారం మరువలేనిది

టంగుటూరు: విద్యార్థులకు సహాయం చేయడానికి దాతలు ముందుకు రావడం హర్షించదగిన విషయమని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సౌజన్య అన్నారు. టంగుటూరు పొత్తుల చెంచయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రావూరి వినీల మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. స్థానిక బీసీ గర్ల్స్ పాఠశాల, బీసీ బాయ్స్ పాఠశాల, స్థానిక ప్రభుత్వ పాఠశాలలో అందించారు. ఫౌండేషన్ అధికార ప్రతినిధి రావూరి తిరుమల రాధా కృష్ణ, సభ్యులు గోపి, సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం జయప్రదం చేయండి

పామూరు: దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని కోరుతూ ఈనెల 5వ తేదీన విజయవాడలో తలపెట్టిన హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని భజరంగ్‌దళ్ సభ్యులు జమకాల నరేష్, పందిటి హరీష్, ఓగూరి ఏడుకొండలు పేర్కొన్నారు. గురువారం పామూరులో కరపత్రాలతో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. దేవాలయాల్లో, దేవాదాయ ధర్మాదాయ శాఖలో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులకు తొలగించాలన్నారు. బండ్ల సురేష్, వరదా ఓబులేసు, శివారెడ్డి, తరుణ్‌కుమార్‌రెడ్డి, సాయిరెడ్డి, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

శిశువికాసంపై అవగాహన

హనుమంతునిపాడు: కిశోర్ బాలికలకు శిశువికాసంపై గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కమల కుమారి, కృపావరం అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థిని వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలన్నారు. సూపర్‌వైజర్లు షేక్ గౌసున్నాషా బేగం, ఎస్ఓ అంజమ్మ, అంగన్‌వాడీ టీచర్లు యక్కంటి రాధమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పొగ మంచు వలన వాహనాలకు లైట్లు వేసుకొని ప్రయాణిస్తున్న వాహనదారులు


ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో జెండా చెట్టు సమీపంలో..

చలి వచ్చే.. వణుకొచ్చే!

కొండపి: స్థానిక కొండపి పట్టణంలో పొగ మంచు కమ్మేసింది. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు విపరీతంగా మంచు పట్టింది. పొగ మంచు వల్ల వాహనదారులు, వాకర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనదారులు తమకు ఎదురు వచ్చే వాహనాలు ప్రజలు కనిపించకపోవడంతో లైట్లు వేసుకొని నెమ్మదిగా ప్రయాణించారు. ఒక్కసారిగా పొగ మంచు అధికమవడంతో రోడ్లు సరిగా కనిపించకపోవడంతో వాకర్లు కూడా ఇబ్బంది పడ్డారు. పొగ మంచుతో కూడా చలి తీవ్రంగా ఉండటంతో వృద్ధులు చలికి ఇబ్బంది పడ్డారు. క్రమేపీ పొగమంచు తగ్గిన చలి మధ్యాహ్నం వరకు అధికంగా ఉంది. 10 గంటలకు ఎండ వేడిమి వచ్చిన చలి ఇబ్బందులకు గురిచేసింది.